
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు
జిల్లా వార్తలు
5
ఆదివారం 30 జూన్ 2024

వామ్మో.. ప్రభుత్వాసుపత్రి



గైనిక్ వార్డు ఎదురుగా దుర్గంధం వెదజల్లుతున్న మురుగును పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు హాస్పిటల్: **ప్రభుత్వ ఆస్పత్రులపై గత వైసీపీ పాలకుల తీవ్ర నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది. ప్రైవేటు వైద్యం కొనే ఆర్థిక శక్తి లేక ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తే వైద్యం అందక పేదలు చాలా ఇబ్బందులుపడ్డారు. కర్నూలు సర్వజన వైద్యశాలలో ఎక్స్‌రే కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిందే.. పసి పిల్లల ఐసీయూ వార్డుల్లో ఏసీలు ఐదేళ్లుగా పని చేయడం లేదు.. రాత్రి పూట కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. పిల్లల వార్డుల పక్కనే కుళ్లిన ఆహారం పడేస్తున్నందు వల్ల దుర్గంధం వస్తోంది. డ్రైనేజీలు మూసుకుపోయి మురుగు నీరు బయటకు వస్తోంది. శనివారం మంత్రి టీజీ భరత్ తనిఖీలో కర్నూలు పెద్దాసుపత్రిలో ఇలాంటివెన్నో బైటపడ్డాయి..**

రాయలసీమ జిల్లాల సామాన్యుల ఆర్యోగ్య మణిదీపం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల. ప్రపంచ దేశాల్లో ప్రఖ్యాతిగాంచిన ఎందరో వైద్యులను తీర్చిదిద్దిన బోధన ఆస్పత్రి ఇది. 36 విభాగాల్లో రోగులకు వైద్య సేవల అందించేందుకు 10,500 బెడ్లు ఏర్పాటు చేశారు. రోజుకు మూడు వేలకు పైగా రోగులు వివిధ జబ్బులతో చికిత్స కోసం ఇక్కడికి వస్తున్నారు. రూ.వేలు, రూ.లక్షలు ఖర్చు చేసి ప్రైవేటు వైద్యం కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు ఉచిత వైద్యసేవలు అందుతాయనే భరోసాతో ఇక్కడికి వస్తున్నారు. ఉమ్మడి కర్నూలు నలుమూలల నుంచే కాకుండా అనంతపురం, కడప జిల్లాలు, సరిహద్దు తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా నుంచే వైద్యం కోసం రోగులు వస్తుంటారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపాలు వల్ల రోగులకు అవస్థలు తప్పడం లేదు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ శనివారం తనిఖీ చేశారు. ఆయన వెంటన కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ హేమనలిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకట్రమణ, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్ తదితరులు ఉన్నారు. క్యాజువాలిటీ, డయాగ్నోస్టిక్ సెంటర్, జనరల్ వార్డు, చిన్న పిల్లల వార్డులు, కాన్పుల వార్డులు, ఎక్స్‌రే కేంద్రాలను మంత్రి భరత్ తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేసినా నిర్వహణ అధ్వానంగా ఉందని పలువురు ఏకరువు పెట్టారు. వార్డుల్లో పర్యటిస్తుంటే దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడి పరిసరాలను క్షణంగా పరిశీలించి మంత్రి టీజీ భరత్ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ తనిఖీకి వస్తా.. అప్పటిలోగా పరిస్థితులు మారకపోతే చర్యలు ఉంటాయంటూ హెచ్చరించారు.

- పిల్లల వార్డుల పక్కనే చెత్తాచెదారం
- ఐసీయూలో ఐదేళ్లుగా పని చేయని ఏసీలు
- ఎక్స్‌రే తీయాలంటే నాలుగైదు రోజులు ఆగాల్సిందే
- మంత్రి టీజీ భరత్ తనిఖీలో వెలుగు చూసిన లోపాలు

పిల్లల వార్డుల్లో దుర్గంధం

పిల్లలు వార్డుల వార్డుల్లో నాలుగు యూనిట్లలో 120 బెడ్లు ఉన్నాయి. అప్పుడే జన్మించిన నవజాత శిశువు నుంచి ఐదదేళ్ల పిల్లల వరకు వైద్య సేవలు అందిస్తున్నారు. పక్కనే మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) ఉంది. ఇక్కడ ఏడు యూనిట్లు.. 260 బెడ్లు ఉన్నాయి. వైద్యం కోసం వచ్చే పసిపిల్లలకు ఇతర జబ్బులు ప్రబలే పరిస్థితి కనిపిస్తోంది. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కుళ్లిన ఆహారం, చెత్తాచెదారం పిల్లలు వార్డుల పక్కనే పడేశారు. డ్రైనేజీలు మూసుకుపోయి మురుగు నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి. సకాలంలో శుభ్రం చేయకపోవడంతో దుర్వాసనతో అవస్థలు తప్పడం లేదు. ఇక్కడే కాదు.. ఆస్పత్రిలో ఏ వార్డుకు వెళ్లినా ఇదే పరిస్థితి ఉంది. పారిశుధ్యం పనుల కోసం ప్రభుత్వం నెలకు రూ.80 లక్షలు ప్రకారం ఏటా రూ.9.60 కోట్లు ఖర్చు చేస్తున్నా.. కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యం, పర్యవేక్షణ సిబ్బంది నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారింది.

అధ్వానంగా పారిశుధ్యం



ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పిల్లల పీఐసీయూ వార్డులో ఐదేళ్లుగా ఏసీలు పని చేయడం లేదంటే గత ప్రభుత్వంలో గొప్పగొప్ప నాయకులమని చెప్పుకునే వారు ఏంచేశారో అర్థం కావడం లేదు. ఎలుకల బెడద కూడా అధికంగా ఉంది. మా నాన్న టీజీ వెంకటేశ్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు కూడా పని చేయడం లేదు. ఎక్స్‌రే కోసం నాలుగైదు రోజులు ఆగాలంటే ఎంత దారుణం. ఒక్క రోజులో అన్ని మార్చలేం. మరోసారి విజిట్‌కు వచ్చే సమయానికి మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి

వార్డుల్లో ఎలుకలతో భయం.. భయం

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకల దాడిలో పసి పిల్లలు మృతి చెందిన సంఘనలు ప్రజల మదిలో చెదిరిపోలేదు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అలాంటి పరిస్థితులు ఉండడంతో పిల్లల తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారు. మంత్రి టీజీ భరత్ తనిఖీ సందర్భంగా ఆస్పత్రిలో విచ్చలవిడిగా ఎలుకలు ఉన్నాయని, వీటి వల్లే కరెంట్ బోర్డు ప్యానల్ మధ్య ఎలుకలు చేరి కరెంట్ సరఫరా ఆగిపోయి రోగులు ఇబ్బంది పడుతున్నారు. మంత్రి ఉండగానే కరెంట్ పోయింది. ఎలుకలు పట్టేందుకు పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీకి నెలకు రూ.4.50 లక్షల చొప్పున ఏడాదికి రూ.54 లక్షలు వెచ్చిస్తున్నా.. ఎలుకల వల్ల ఇబ్బందులు తీరడం లేదు.



క్యాజువాలిటీలో రోగులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి

కారు చీకట్లలో రోగులు

ఆస్పత్రిల్లో రోగులు కారుచీకట్లలో ఉండాల్సి వస్తోంది. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందని రోగులు మంత్రి టీజీ భరత్ దృష్టికి తెచ్చారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌లను పిలిపించి సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ సమస్య మళ్లీ ఉత్పన్నం కారాదని ఆశించారు. 26న అర్ధరాత్రి నుంచి ఐదు గంటలు కరెంట్ సరఫరా ఆగిపోతే రోగులు పరిస్థితి ఏమిటని నిలదీశారు. అదే క్రమంలో చిన్న పిల్లల పీఐసీయూ వార్డులో ఐదేళ్లుగా ఏసీలు పని చేయడం లేదని రోగులు, సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇన్నేళ్లు ఏం చేశారు..? అంటూ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐదుగురికే కాంట్రాస్ట్ సీటీ పరీక్షలు

రోగులకు అత్యవసర వైద్యం కోసం కాంట్రాస్ట్ సీటీ స్కాన్ పరీక్షకు వైద్యులు సూచిస్తున్నారు. డయగ్నోస్టిక్ సెంటరుకు వెళితే రోజుకు ఐదుగురు రోగులకు మించి కాంట్రాస్ట్ పరీక్షలు చేయలేని పరిస్థితి వెలుగు చూసింది. ఆపైనే వస్తే బయటకు వెళ్లాల్సిందే. ప్రైవేటు ల్యాబ్‌లో శరీర భాగాన్ని రూ.4 వేల నుంచి రూ.12 వేలు వరకు వసులు చేస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి డై ఇంజక్షన్ సరఫరా లేకపోవడమే ఈ పరిస్థితి కారణం. దీనిపై మంత్రి తీవ్రంగా స్పందించారు. అలాగే.. ఎక్స్‌రే కోసం వెళితే నాలుగైదు రోజులు అయినా తీయడం లేదు.



ఎక్స్‌రే కోసం రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు



శుద్ధ జలం.. అందని దైన్యం

రోగులు, వారికి సహాయంగా వచ్చే ప్రజలకు తాగునీరు అందడం లేదు. పేద రోగులను దృష్టిలో ఉంచుకొని మాజీ రాజ్యసభ ఎంపీ టీజీ వెంకటేశ్ నాలుగు శుద్ధి జలాలు అందించే తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అవి పని చేయడం లేదు. తాగునీరు ఇవ్వకపోతే ఎలా..? రిపేరి చేయవచ్చు కదా..? అంటూ నిలదీశారు. తక్షనమే మరమ్మతులు చేసి శుద్ధ జలాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎక్స్‌రే కోసం వారం రోజులుగా తిరుగుతున్నా



వెన్ను నొప్పితో ఆస్పత్రికి వచ్చాను. డాక్టర్లు ఎక్స్‌రే తీసుకొని రావాలన్నారు. ఎక్స్‌రే యూనిట్-4కు వెళితే మిషన్ పని చేయడం లేదని, కరెంట్ లేదని వారం రోజులుగా తిప్పుకుంటున్నారు. ఈ రోజు వస్తే కరెంట్ లేదు. ఇదే విషయం మంత్రి టీజీ భరత్‌కు వివరించాను..

- లత, కర్నూలు

దారుణ పరిస్థితులు ఉన్నాయి



నా భర్త ఇనూష్‌కు నరాల సమస్య. వైద్యం కోసం వచ్చాం. న్యూరో వైద్యులు ఎక్స్‌రే తీసుకురావాలని చెప్పారు. ఇక్కడికి వస్తే మూడు రోజులైంది తీయడం లేదు. ఈ రోజు వస్తే కరెంట్ పోయిందంటున్నారు. ఇదేమని అడిగితే నోరు మూసుకో అంటూ గద్దిస్తున్నారు.

- రమీజా, పెద్దపాడు

ఫారెస్టు భూముల పరిశీలన



పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు, జూన్ 29: మండలంలోని శకునాల గ్రామ సమీపాన ఉన్న సోలార్ గ్రీన్‌కో సమీపంలోని ఫారెస్టు భూములను శనివారం రెవెన్యూ, అటవీ శాఖ, సోలార్ అధికారులు పర్యవేక్షించారు. గత రెండు రోజుల క్రితం సోలార్ పార్కులో ఫారెస్టు భూమి ఆక్రమించుకుని హైడర్ ప్రాజెక్టు నిర్మించారనే వార్తలు రావడంతో స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సర్వే ఏడీఏ మునికన్నా, ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ నటరాజు, డీఎఫ్‌వో శ్యామల, డీఐ, విజయసారథి, డీఐవోఎస్ సుబ్బారెడ్డి, ఓర్వకల్లు సర్వేయర్ జయరాముడు, ఫారెస్టు అధికారులు, సర్వేయర్లు ఫారెస్టు భూములను గుర్తించేందుకు సర్వేలు చేపట్టారు. సర్వే అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. నం ద్యాల జిల్లాలోని గడివేముల పాణ్యం మండలం ఓర్వకల్లు ప్రాంతాల్లో ఫారెస్టు భూమిని ఆక్రమించారని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఈ పరిసర ప్రాంతాల్లో ఆయా శాఖ అధికారులు సర్వే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రీన్-కో అధికారి నాయుడు, సిబ్బంది ఉన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు



లోక్ అదాలత్‌లో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయ అధికారి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జూన్ 29: కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లు కృషి చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు కోరారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లలో ఎటువంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని, ఈ లోక్ అదాలత్‌లలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు ఇంకా దాఖలు కానీ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1139 కేసులు పరిష్కారమై రూ.11,37,54,141 పరిహారాన్ని చెల్లించేందుకు తీర్మానించినట్లు ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అదనపు జిల్లా జడ్జీలు పి. పాండురంగారెడ్డి, పి. దివాకర్, టి. జ్యోత్స్నదేవి, జూనియర్ సివిల్ జడ్జీలు ఎం. సరోజనమ్మ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- సీఎం పదవిని అడ్డుపెట్టుకొని ఇలా చేయవచ్చా?
- సీఎంకు ఫిర్యాదు చేస్తాం: సోమిశెట్టి
- వైసీపీ కార్యాలయ నిర్మాణాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు, కార్పొరేటర్లు



వైసీపీ ప్యాలెస్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 29: అక్రమంగా చేపట్టిన వైసీపీ కార్యాలయ నిర్మాణంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఐదు రోడ్ల కూడలిలో ఉన్న ఆగ్రోస్ కార్పొరేషన్ స్థలంలో అక్రమ నిర్మాణాలను నగర కార్యదర్శి నాగరాజు యాదవ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశమని ముఖ్యమంత్రి పదవి చెపట్టిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచుకున్నారని ధ్వజమెత్తారు. నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి టీజీ భరత్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైసీపీ జిల్లా కార్యాలయాల పేరుతో రూ. 3వేల కోట్ల విలువైన భూములు, స్థలాలను ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. ఈ నిర్మాణాలను స్వాధీనం చేసుకొని, వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకోవాలని, అక్రమంగా నిర్మించుకున్నటువంటి జగన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రభుత్వ ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు వైసీపీ కుట్ర చేసిందని అన్నారు. నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో జగన్మోహన్‌రెడ్డి బెంగుళూరు, హైదరాబాద్, రుషికొండ, పులివెందుల, తాడేపల్లి ప్యాలెస్‌లు నిర్మించుకోవడమేగాక జిల్లాకో ప్యాలెస్ అవసరమా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పరమేష్, రమణమ్మ, నాయకులు సోమిశెట్టి నవీన్, జె. తిరుపాల్ బాబు, సత్రం రామకృష్ణుడు, గున్నామార్క్, రమీజ్ పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ నిర్లక్ష్యంపై సీఎస్ ఆరా..?

- పూర్తి స్థాయి నివేదిక కోరుతూ లేఖ
- ఉర్దూ వర్సిటీ ఉపకులపతి రాజీనామా
- తర్జన భర్జనలో ఆర్‌యూ వీసీ
- రాజీనామా చేసిన రిజిస్ట్రార్ .. వెంకటేశ్వర్లుకు బాధ్యతలు



కర్నూలు(అర్బన్), జూన్ 29: జిల్లాలోని 3 యూనివర్సిటీల పాలనాతీరుపై కొత్త ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నివేదిక కోరడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. దేశంలోనే ప్రత్యేకంగా ఏర్పాటైన ఏడు వర్సిటీల్లో దక్షిణ భారతదేశానికిగాను కర్నూల్లో క్లస్టర్ యూనివర్సిటీని కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రకటించి 2021 మార్చిలో ఏర్పాటు చేసింది. ప్రత్యేకలతో కూడిన ఉపాధి కోర్సులతో ప్యాటన్ రూపొందించింది. అయితే ఎంతో ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీ నిర్లక్ష్యానికి గురైంది. ఉన్నత విద్యాశాఖ కమిషన్ నిర్లక్ష్య ధోరణి ఉన్నత విద్య చదివే వారికి శాపంగా మారింది. ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాల, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలను క్లస్టర్ యూనివర్సిటీకి ఆయా కళాశాలలు అనుసంధానం చేయాల్సి ఉండగా ఆ ఈ ప్రక్రియ అటకెక్కింది. ఆయా కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లకు ఉపకులపతికి ఆజ్యం పోసి యూనిర్సిటీని ఉన్నత విద్యాశాఖ భ్రష్టు పట్టించిందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నాయి. పైగా ఎన్నికల కోడ్ సమయంలో యూనివర్సిటీ పరిధిలోని కళాశాలకు ఒకరిని ప్రిన్సిపాల్‌గా ప్రజాప్రతినిధుల ఒత్తిడితో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం కోరిందని వర్సిటీ అధికారులు తెలిపారు.

క్లస్టర్ వర్సిటీ నిర్లక్ష్యానికి గురైంది ఇలా..

2021లో ప్రభుత్వం రూ. 88.50 కోట్లు మంజూరు చేసింది. 2021 మార్చిలో ఉపకులపతిని నియమించారు. 2020-21లో విశ్వవిద్యాలయ నిర్మాణానికి జగన్నాథ గట్టు మీద 50 ఎకరాల భూమి కేటాయించారు. ఒప్పందం ప్రకారం సదరు కాంట్రాక్టర్ 15 నెలల కాలంలో పని పూర్తి చేయాల్సి ఉంది.. కేవీఆర్ మహిళా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల 169 టీచింగ్ 104 మంది నాన్ టీచింగ్, 49 టీచింగ్, 79 నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలి. జాతీయ విద్యావిధానం ప్రకారం విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తేవాలి. క్లస్టర్ వర్సిటీ పరిధిలోకి కేవీఆర్ కళాశాల కాలేజీలను తేవాలి. అయితే బడ్జెట్ ఫర్నిచర్, టీచింగ్ క్లస్టర్ పరిధిలోని తెచ్చేందుకు చొరవ చూపలేదు. 43 మందిని ఉన్నత విద్యాశాఖ కమిషన్ కార్యాలయం ద్వారానే బదిలీలు జరిగాయి. ఈ పరిస్థితుల్లో యూనివర్సిటీ ఉపకులపతి కార్యకలాపాలు ముందుకు సాగకుండా అడుగడుగునా అమరావతిలోని ఉన్నత విద్యాశాఖలోని ఓ అధికారి మితిమీరిన జోక్యం కారణంగా వర్సిటీ పాలనా తీరు అస్తవ్యస్తంగా తయారైందని విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వివరాలను కోరినట్లు సమాచారం.

సీఎంవో ఆదేశాలతో..

సీఎంవో మౌఖిక ఆదేశాలతో డాక్టర్ అబ్దుల్ హాక్ ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఫజలూర్ రహిమాన్ రాజీనామా చేశారు. రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి రాజీనామాపై తర్జన భర్జనలో ఉన్నట్లు సమాచారం. శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ అంకన్న తన పదవికి రాజీనామా చేయడంతో ప్రొఫెసర్ వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించారు.

అవ్వా తాతలకు రూ.7,000



- 1 నుంచి రూ.4 వేల పింఛన్
- ఏప్రిల్ నుంచి పెంచుతామని హామీ
- మూడు నెలల బకాయి రూ.3 వేలు
- జిల్లాలో 2.45 లక్షల మందికి రూ.93.82 కోట్ల లబ్ధి
- బ్యాంకుల నుంచి రూ.167 కోట్లు డ్రా చేసిన సచివాలయ ఉద్యోగులు
- తొలి రోజే వంద శాతం పంపిణీకి సన్నాహాలు

కర్నూలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు ఈ నెల 13న సీఎంగా బాధ్యతలు చేపట్టిన తక్షణమే అవ్వాతాతల పింఛన్ రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం చేశారు. దీనికి ఇటీవల మంత్రివర్గం సమావేశమై ఆమోద ముద్ర వేసింది. గత వైసీపీ ప్రభుత్వం సాగించిన ఆర్థిక విధ్వంసం కారణంగా ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితుల్లో పెంచిన పింఛన్ రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి అమల్లోకి రావడంతో బకాయి రూ.3 వేలు కలిపి రూ.7 వేలు జూలై ఒకటో తారీఖున ఎలా పంపిణీ చేస్తారనే ప్రశ్న వినిపిస్తోంది. అయితే చంద్రబాబు తన పాలన అనుభవంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవ్వాతాతలకు రూ.7 వేలు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో 2.45 లక్షల మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.176.35 కోట్లు సచివాలయ సిబ్బంది వివిధ బ్యాంకుల నుంచి శనివారం డ్రా చేసుకున్నారు. ఒకటో తారీఖు సోమవారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టరు పి. రంజిత్‌బాషా, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా ఏర్పాట్లు చేశారు.

అవ్వాతాతల్లో ఆనందం

వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సామాజిక భద్రత కల్పించాలనే సంకల్పంతో 1983లో వృద్ధాప్య పంఛన్ పథకానికి ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ దేశంలోనే మొదటిసారి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.200 పింఛన్‌ను రూ1,000కు, 2019 జనవరిలో రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు పెంచారు. తాజాగా రూ.4 వేలకు పెంచడమే కాకుండా.. ఏప్రిల్ నుంచి అమలు చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బకాయి రూ.3 వేలుతో కలిపి రూ.7 వేలు జూలై ఒకటో తారీఖున ఇచ్చేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 3,750 సచివాలయాల పరిధిలో వివిధ క్యాటగిరీల కింద 2.45 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.167.35 కోట్లు సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేశారు. ఉదయం 6 గంటల నుంచి ప్రతి సచివాలయ సిబ్బంది 50 మందికి తగ్గకుండా పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. వంద శాతం పంపిణీ చేయాలని కలెక్టరు రంజిత్‌బాషా మండలాల ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశారు. రూ.7 వేలు పింఛన్‌తో పాటు ధ్రువపత్రం, సీఎం చంద్రబాబు లేఖ అందజేయాలి. అదే క్రమంలో పింఛన్ ముట్టినట్లు రసీదు కూడా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జూన్ ఒకటో తారీఖున రూ.3 వేల ప్రకారం రూ.73.53 కోట్లు పంపిణీ చేశారు. జూలై ఒకటిన బకాయితో కలిపి రూ.7 వేలు చొప్పున జిల్లాలో ఉన్న 2.45 లక్షల మందికి రూ.167.35 కోట్లు పంపిణీ చేయబోతున్నారు. అంటే.. గత నెలతో పోలిస్తే రూ.93.82 కోట్లు అవ్వాతాతలు అదనపు ఆర్థిక లబ్ధి పొందనున్నారు.

జిల్లాలో లబ్ధి పొందనున్న సామాజిక పింఛన్‌దారులు, పంపిణీ చేసే నగదు రూ. కోట్లల్లో

పింఛదారులు	లబ్ధిదారులు	నగదు మొత్తం
వృద్ధులు	1,25,845	88.09
వితంతువులు	71,498	50.05
దివ్యాంగులు	31,434	18.86
చేనేత కార్మికులు	2,945	2.06
కల్లుగీత కార్మికులు	242	0.17
హిజ్రాలు	241	0.17
ఒంటరి మహిళలు	5,881	4.12
మత్స్యకార్మికులు	817	0.57
డప్పు కళాకారులు	1,456	1.02
చర్మకారులు	1,141	0.80
అభయహస్తం	2,559	0.13
ఇతరులు	1,172	1.28
మొత్తం	2,45,229	167.35

టిడ్కో ఇళ్ల పంపిణీ పట్టించుకోని వైసీపీ

- నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా
- మంత్రి టీజీ భరత్



సమీక్ష సమావేశంలో మంత్రి టీజీ భరత్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 29: రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల పంపిణీని గత గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేసిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి టిడ్కో, పారిశుధ్య విభాగం అధికారులతో ప్రభుత్వ అతిథి గృహంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు టిడ్కో ఇళ్లను గాలికి వదిలేసిందన్నారు. ప్రస్తుతం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో వార్డుల వారిగా టిడ్కో లబ్ధిదారుల వివరాలు అందజేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నివేదికల ఆధారంగా టిడ్కో ఇళ్ల పంపిణీని పరిశీలిస్తామని అన్నారు. నగరంలో పారిశుధ్యం మెరుగుపడాలంటే కార్మికుల సంఖ్య కొరతగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. కార్మికుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సచివాలయం ఉద్యోగికి షోకాజ్ నోటీసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోడుమూరు, జూన్ 29: పట్టణంలోని సచివాలయం ఉద్యోగి డిజిటల్ అసిస్టెంట్‌కు రమేష్‌కు ఎట్టకేలకు షోకాజ్ నోటీసును అందజేశారు. ఈ నెల 28న ఇష్టారాజ్యం, విధుల్లో నిర్లక్ష్యం అనే శీర్షికతో కథనం ప్రచురితం అయింది. ఇందుకు ఎంపీడీవో దివ్య స్పందిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమయపాలన పాటించి సచివాలయం ఉద్యోగస్తులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు.

గురుకుల విద్యార్థులకు 2, 3 తేదీల్లో కౌన్సెలింగ్

పాణ్యం, జూన్ 29 : మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష మెరిట్ విద్యార్థులకు జూలై 2, 3 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ఫ్లోరమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు బాలురకు 2వ తేదీన, బాలికలకు 3వ తేదీన నెరవాడ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాల గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, కన్వీనర్ ఆధ్వర్యంలో మెరిట్, కులాల ఆధారంగా సీట్ల భర్తీ 1:2 నిష్పత్తిలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

కొత్తపల్లి కానిస్టేబుల్ సస్పెన్షన్

కొత్తపల్లి, జూన్ 29: కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సి.విష్ణువర్ధన్ రెడ్డి అనే కానిస్టేబుల్‌ను ఎస్పీ రఘువీర్ రెడ్డి శనివారం సస్పెండ్ చేసినట్లు కొత్తపల్లి ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. కానిస్టేబుల్ విష్ణువర్ధన్ రెడ్డి కొత్తపల్లి, పాములపాడు, ఆత్మకూరు మండలాల్లో విధుల్లో ఉండి మద్యం తాగడంతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిపారు. కొత్తపల్లి మండల ప్రజలను నానా దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురి చేసినట్లు ఫిర్యాదులు అందాయని చెప్పారు. అంతేగాకుండా గత ఎన్నికల సమయంలో ఎజలకు సేవలు అందించకపోవడం, దురుసుగా మాట్లాడడం తదిరత కారణాల వల్ల ఎస్పీ దృష్టికి వెళ్లడంతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), జూన్ 29: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్, గవర్నమెంటు నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 30 కేటగిరీల అభ్యర్థుల మెరిట్ లిస్టు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్ కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేసినట్లు ప్రిన్సిపాల్ డా. చిట్టినరసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. Https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in, https://kurnoolmedicalcollege.ac.in వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ మెరిట్ వివరాలు సరి చూసుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే జూలై 1 నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

1 నుంచి 10 వరకు టీచ్ టూల్ శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 29: జూలై 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదోని ప్రభుత్వ బాలికల పాఠశాల, పత్తికొండ ప్రభుత్వ బాలురు, ఎమ్మిగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలికలు), పెద్దపాడు, కల్లూరు మండలం కర్నూలు ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ శిక్షణా కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొత్తం 492 మంది పాల్గొంటారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాగలమర్రి, జూన్ 29: నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామానికి చెందిన అబ్దుల్లా(35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హీరో షోరూమ్‌లో ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్లా దువ్వూరు నుంచి చాగలమర్రికి వస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామం వద్ద డివైడర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

లారీ, బొలేరో వాహనం ఢీ

ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు, మరొకరి పరిస్థితి విషమం

మంత్రాలయం, జూన్ 29: మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట సమీపంలో బొలేరో వాహనం, మినీ లారీ ఢీకొని ఒకరు మృతి చెందగా.. ఐదు మందికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ రోడ్డు ప్రమాదం శనివారం తెల్లవారుజామున జరిగింది. మంత్రాలయం ఎస్‌ఐ గోపీనాథ్ తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని సిరా తాలుకా జంజిరామనహల్లి గ్రామానికి చెందిన పది మంది కుటుంబ సభ్యులు బొలేరో వాహనంలో రాఘవేంద్రస్వామి దర్శనానికి బయలుదేరారు. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట వద్ద బొలేరోకు మహారాష్ట్రలోని లాతూరు జిల్లా హంస గ్రామానికి చెందిన అవినాశ్ డీసీఎం మినీ లారీని డ్రైవ్ చేస్తూ వచ్చి ఢీకొట్టాడు. అవినాశ్ గుల్బర్గా నుంచి చింతామణి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బోలేరో డ్రైవర్ హనుమంతరాజు, లారీ డ్రైవర్ అవినాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బొలేరో వాహనంలో ఉన్న రమ్య, శృతి, చరణ్, మంజునాథ్‌లకు గాయాలయ్యాయి. మంత్రాలయం ఎస్‌ఐ గోపీనాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బోలేరో డ్రైవర్ హనుమంతరాజు (29) బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. గాయపడిన మిగతా వారు ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంజామల, జూన్ 29 : విద్యుత్ ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఆకుమళ్ళలో చోటుచేసుకుంది. ఈ సంఘటనపై సంజామల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆకుమళ్ల గ్రామానికి చెందిన షేక్ నబీర సూల్(55) గ్రామంలో ప్రైవేట్‌గా కరెంట్ పనులు చేసేవాడు. గ్రామానికి చెందిన రామయ్య వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు సవరించేందుకు నబీరసూల్, రాజు, రామయ్య ముగ్గురు కలిసి ఈ నెల 22న పొలం దగ్గరికి వెళ్ళారు. రామయ్య పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి నబీరసూల్ విద్యుత్ తీగలు సవరిస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. అతని తలకు బలమైన గాయం తగలడం వల్ల అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స కోసం అతడ్ని కోవెలకుంట్ల హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల శాంతి రామ్ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ కోలుకోలేక నబీరసూల్ మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కొడుకు బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టన్నెల్ క్యాంపు వద్ద టిప్పర్ తగిలి రైతు మృతి

అవుకు, జూన్ 29 : నంద్యాల జిల్లా, అవుకు మండలం, మెట్టుపల్లె గ్రామ సమీపంలో నిర్మితమవుతున్న టన్నెల్ - 3 క్యాంపు కార్యాలయం వద్ద టిప్పర్ తగిలి కోనాపురం గ్రామానికి చెందిన రైతు పెద్దమద్దిలేటి (62) శనివారం మృతి చెందాడు. రైతు పెద్దమద్దిలేటికి టన్నెల్ - 3 క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న 5 ఎకరాలు పొలం ఉంది. ఉదయం పొలం సమీపంలోనే ఉన్న టన్నెల్ క్యాంపు కార్యాలయంలోనికి వెళ్లాడు. టన్నెల్‌కు సంబంధించిన టిప్పర్ రివర్స్‌లో వచ్చి పెద్దమద్దిలేటిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య రామక్క, ముగ్గురు కొడుకులు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి. లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మీ, కేతన్ భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతో పాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లతో కలిసి అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన పాణ్యం ఎమ్మెల్యే



కలెక్టర్‌ను కలిసిన పాణ్యం ఎమ్మెల్యేలు

కల్లూరు, జూన్ 29: నూతన కలెక్టర్ పి. రంజిత్‌బాషాను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో గౌరు చరిత పుష్పగుచ్ఛం అందించి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ పాలనలో నాయకులు రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారని వ్యవస్థను గాడిలో పెట్టాలని ఆమె కోరారు. పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని గౌరు చరిత కలెక్టర్‌ను అభ్యర్థించారు. అలాగే నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భ్రామరికి బంగారు హారం



బంగారు హారాన్ని సమర్పిస్తున్న దాత

శ్రీశైలం, జూన్ 29: శ్రీశైలం భ్రమరాంబికాదేవికి హైదరాబాద్‌కు చెందిన నూకల నటరాజ్ అనే భక్తుడు శనివారం కుటుంబ సమేతంగా వచ్చి లక్ష్మీకాసుల బంగారు హారాన్ని సమర్పించుకున్నారు. రూ. 24,41,433 విలువైన ఈ హారం 375 గ్రాముల 400 మిల్లీగ్రాములు ఉందని దాత తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఈ బంగారు హారాన్ని అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయస్వామి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ రామనాయుడుకు అందజేశారు. దాతలకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందజేశారు.

రామచంద్రాపురంలో రెండు డయేరియా కేసులు

కోడుమూరు/కోడుమూరు(రూరల్) జూన్ 29: కోడుమూరు మండలం రామచంద్రాపురం (కొత్తూరు) గ్రామంలో రెండు డయేరియా కేసులు నమోదయ్యాయి. డీఎంఅండ్‌హెచ్‌వో ప్రవీణ్‌కుమార్ శనివారం గ్రామాన్ని సందర్శించి డయేరియా బారిన పడిన అక్కమ్మ, మధు ఇండ్లకు వెళ్లి వాళ్ల పరిస్థితిని పరిశీలించారు. బాధితులను కోడుమూరు సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని తాగునీటి కుంటను పరిశీలించారు. గ్రామ ప్రజలకు మంచినీటిని సరాఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. గ్రామ ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షఫియాబేగం, హెచ్‌ఈ క్రిష్టారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో రామకృష్ణయ్య సిబ్బంది రాఘవయ్య, వెంకటేశ్వరమ్మ, సరస్వతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

1న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 29: కర్నూలు కలెక్టరేట్‌లోని సోమవారం సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, జూన్ 29: మండలంలోని వెంగళాంపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధనుంజయ(30) అనే వ్యక్తి మృతి చెందాడు. గుత్తికి చెందిన ధనుంజయ ఆయన మిత్రుడు శివయ్య కలసి బైకుపై బేతంచెర్ల మండలంలోని మద్దిలేటిస్వామి పుణ్యక్షేత్రానికి వెళ్లారు. అక్కడ స్వామిని దర్శించుకొని తిరిగి వస్తుండగా వెంగళాంపల్లి సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టింది. దీంతో ధనుంజయ అక్కడి కక్కడే మృతి చెందాడు. శివయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్టర్ల జీవితాల్లో వెలుగులు నింపాలి



అహోబిలంలో పూజలు చేసిన రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఆళ్లగడ్డ, జూన్ 29: రాష్ట్రంలోని కాంట్రాక్టర్ల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతూ రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టి విజయ కుమార్ తన కార్యవర్గ సభ్యులతో అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నో నిర్మాణ పనులు చేసినా పైసా బిల్లులు అందలేదని అన్నారు. నూతన ప్రభుత్వంలోనైనా కాంట్రాక్టర్ల సమస్యలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉదయం నుంచే పింఛన్ పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేయడానికి నగదును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకొని, జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచే పంపిణీ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఎఫ్‌పీఎస్ బయోమెట్రిక్ యంత్రాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీ వ్యవస్థను పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేయాలన్నారు. దీని కోసం నూతనంగా రూపొందించిన పింఛన్ డిస్ట్రిబ్యూషన్ యాప్‌ను ఎంపీడీవోలు డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. బ్యాంకుల బ్రాంచ్‌లకు నగదు విత్‌డ్రా చేసుకుని, పంపిణీ చేసే వరకు కలెక్టర్లు పరిశీలిస్తూ ఉండాలన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో ముఖ్యమంత్రి లేఖను కూడా లబ్ధిదారులను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీని ప్రారంభించి అదే రోజే పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి అవసరమైన రూ.167 కోట్ల నగదును డ్రా చేసుకొని పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వంద శాతం సజావుగా పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎల్డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్‌కు సోమిశెట్టి విందు



విందులో పాల్గొన్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూన్ 29: రాష్ట్ర మంత్రి టీజీ భరత్ నగరాభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. శనివారం తన నివాసంలో మంత్రి టీజీ భరత్‌కు విందు ఇచ్చారు. ఈ సందర్భంగా సోమిశెట్టి కుంటుంబ సభ్యులతో మంత్రి కలిసి విందులో పాల్గొన్నారు. అనంతరం ఆర్యవైశ్య సమాజం కోసం చేట్టాల్సిన కార్యాచరణపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు సోమిశెట్టి నవీన్, సోమిశెట్టి కిషోర్‌తోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి వచ్చిన నిధులు ఏమయ్యాయి?

గూడూరు, జూన్ 29: గూడూరు నగర పంచాయతీ అభివృద్ధికి వచ్చిన నిధులు ఏమయ్యాయి?.. ఆ నిధుల ఖర్చుకు సంబంధించిన సమాచారం ఇవ్వండంటూ మున్సిపల్ అధికారులను వైసీపీ కౌన్సిలర్ మూలగేరి దస్తగిరి ప్రశ్నించారు. శనివారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జె వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఇన్‌చార్జి కమిషనర్, ఏఈ నరసింహులు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం ప్రారంభం కాగానే వైసీపీ కౌన్సిలర్ దస్తగిరి నగర అభివృద్ధికి నిధులు మంజూరు అయినప్పటికి ఎక్కడ అభివృద్ధి పనులు కనిపించడం లేదని అధికారులను ప్రశ్నించారు. పాత బస్టాండ్‌లో రోడ్డుకు అడ్డంగా అంగళ్ళు ఇష్టారాజ్యంగా పెడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోఆప్షన్ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ ఏమైందని అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రై డేను తప్పనిసరిగా పాటించాలి

సి.బెళగల్, జూన్ 29: గ్రామాల్లో డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని ఈవోఆర్డీ సందీప్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. శనివారం మండలంలోని కంబంధహాల్, సి.బెళగల్ గ్రామ పంచాయతీలలో ఆయన పర్యటించి పారిశుధ్య సిబ్బందితో మురుగు కాలువల్లో దోమల మందు పిచికారి చేయించారు. ఈసందర్భంగా ఈవోఆర్డీ సందీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మురుగు కాలువలలో ఉన్న తాగునీటి పైపులైన్లు తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు.

ఓర్వకల్లులో వేలం పాటలు

ఓర్వకల్లు, జూన్ 29: మండల కేంద్రమైన ఓర్వకల్లు పంచాయతీకి చెందిన బండ్లగేటు, నాలుగు షాపులకు శనివారం ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సచివాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. బండ్లగేటుకు వేలాన్ని ఓర్వకల్లు గ్రామానికి చెందిన మద్దిలేటి రూ.1.52లక్షలతో పాట పాడి దక్కించుకున్నారు. నాలుగు షాపులు రూ.36,900 వేలందారులు పాట పాడి దక్కించుకున్నారని తెలిపారు. గ్రామ పెద్దలు లక్ష్మీకాంతరెడ్డి, అన్వర్, అబ్దుల్లా, కర్రస్వాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక కారిడార్లు పూర్తి చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 29: జిల్లాలో పారిశ్రామిక కారిడార్లు పూర్తి చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లు పారిశ్రామిక హబ్, ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్కు, ఆదోని జిన్నింగ్ ప్రాసెసింగ్ మిల్లులు, పత్తికొండ టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ, ఆలూరు జింకల పార్కు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై నగరాలకు మధ్యలో ఉన్న కర్నూలు నగరానికి ఐటీ పార్కు, బీపీఓ కంపెనీలు, ఉల్లి, వేరుశనగ ప్రాసెసింగ్ కంపెనీలను తీసుకురావడానికి రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఐటీ మంత్రి నారాలోకేష్ కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ శారదా సంగీత కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు(కల్చరల్), జూన్ 29: నగరంలోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సి.మునికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల్లో గాత్ర సంగీతం, వయోలిన్, నాదస్వరం, మృదంగం వాయిద్య అంశాల్లో, కూచిపూడి నృత్య అంశంలో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఈ ఏడాది జూలై 1 నాటికి 10 సంవత్సరాల వయసు నిండిన పిల్లలు అర్హులని, పెద్దవారికి వయో పరిమితి లేదని తెలిపారు. కళాశాల్లో ఆయా విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సులు, రెండేళ్ల డిప్లమో కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల వారు నగరంలోని ఆర్డీవో ఆఫీసు సమీపం లోగల సంగీత కళాశాలలో దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాసులను ఆగస్టు 31వ తేదీ లోగా కళాశాల్లో అందజేయాలన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 29: నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ కలెక్టరేట్ పక్కనే పందులు పొర్లాడే చోట తాగునీరు సరఫరా చేసేలా వాల్ బిట్స్ ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ పగిలిపోయిన పైప్‌లైన్ల నీటిలో పందులు సంచరిస్తున్నాయని అన్నారు. నగరంలోని కొన్ని కాలనీల్లో మున్సిపల్ కొళాయి నీటితో స్నానం చేస్తే ఒళ్లంతా దురద వచ్చే పరిస్థితి ఉందన్నారు. అనంతరం మేనేజర్ చిన్న రాముడుకు వినతిపత్రం అందజేశారు. న్యాయవాది పాపారావు, కే.రంగా స్వామి, వెంకటేశ్వర్లు, కే.శ్రీనివాసులు, మద్దిలేటి పాల్గొన్నారు.

మాటలు వద్దు.. చేతల్లో చూపండి

» అధికారులను ఆదేశించిన మంత్రి టీజీ భరత్

కర్నూలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మాటలు కాకుండా చేతల్లో చూపించాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల తనిఖీలు సహా వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ శనివారం బిజీగా గడిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పలు శాఖల సమీక్షలు నిర్వహించారు. స్టేట్ గెస్ట్ హౌస్‌లో విద్యా శాఖ, సర్వశిక్ష అభియాన్, సాంఘిక సంక్షేమ శాఖ, ఏపీ టిడ్కో, జలవనరుల శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు లెక్కలు చెప్పబోతే మాటలు వద్దు.. చేతల్లో చూపించాలంటూ చురకలు వేశారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సేవలు, వసతులు కల్పించాలని సూచించారు. భవనం శిథిలావస్థకు చేరిన బీసీ హాస్టల్‌ను మూసివేశామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపాలని ఆదేశించారు. టిడ్కో ఇళ్ల పంపిణీ చేయడానికి ఎన్ని సిద్ధంగా ఉన్నాయని అడిగితే.. ఫేజ్-1 కింద నిర్మించిన 10 వేల ఇళ్లు సిద్ధంగా ఉన్నాయని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. నగరపాలక, ఇరిగేషన్ ఇంజనీర్లు సమన్వయంతో నగరంలోని ప్రవహించే హంద్రీ, వక్కేరు, సుద్దవాగు, కేసీ కాల్వల్లో గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. కర్నూలు నగరంలో పాటు ఆయా నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలతో కలిసి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిద్దామని సూచించారు. గార్గేయపురం చెరువు కబ్జాకు గురైన విషయం మంత్రి టీజీ భరత్ ప్రస్తావిస్తే.. దీనిపై ఆర్డీఓకే నివేదిక ఇచ్చామని ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. సమీక్ష సమావేశాల్లో డీఈఓ శ్యాముల్, ఐ అండ్ పీఆర్ డీడీ జయమ్మ సహా వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జీవితంపై రాసిన వ్యాసాల సంపుటిని ఆవిష్కరిస్తున్న మంత్రి

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి: టీజీ భరత్

కర్నూలు(కల్చరల్): దివంగత చలన చిత్ర నటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలో సంకల్‌బాగ్‌లోని ఆయన స్వగృహంలో తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో ఎన్‌టీఆర్ జీవి తంపై ముద్రించిన 'ఎన్టీయార్ ఎట్ 100' పుస్తకం (108 వ్యాసాల సంపుటి) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎన్‌టీ రామారావు ఒక దివ్య పురుషుడని, అటు సినీ జీవితంలోనూ, ఇటు రాజకీయ రంగంలోనూ, సేవారంగంలోనూ ఆదర్శప్రాయునిగా నిలిచారని కొనియాడారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం కేంద్రంలో ఉన్నందున ఎన్‌టీఆర్‌కు భారతరత్న పురస్కారం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎన్టీయార్ ఎట్ 100 పుస్తకంలోని వ్యాసాల్లో కర్నూలుకు చెందిన రచయితలు పత్తి ఓబులయ్య, ఎస్‌డీవీ అజీజ్‌ల వ్యాసాలు కూడా చోటుచేసుకోవడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య ఎన్‌టీఆర్‌పై రచించిన 'తెలుగు భోజుడు' గ్రంథాన్ని ఆవిష్కరించి, రచయితను అభినందించారు. రచయితలు సమాజ హితం కోరే రచనలు చేయాలని, అందుకు తమ ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రచయిత పత్తి ఓబులయ్య, కేసీ కల్కూర, వ్యాపారవేత్త కె. చంద్రశేఖర్, రంగస్థల నటులు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

మంత్రి టీజీని కలిసిన పీఆర్‌టీయూ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్)/ కర్నూలు(ఎడ్యుకేషన్): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్‌ని శనివారం పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యనిర్వహక ప్రధాన కార్యదర్శి కరుణానిధిమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు, నిరుద్యోగ భవిష్యత్తుకు బాటలు వేయాలని టీజీ భరత్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణా, సుదర్శన్, రమణయ్య, మల్లయ్య, పుల్లయ్య శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ రెడ్డి, దాదామియా, జయప్రకాష్, సుమన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్వచ్ఛ ఆంధ్రకార్పొరేషన్ ద్వారా 7 నెలలుగా జీతాలు రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం బినామీ పేరున రెడ్డి ఏజెన్సీని ఏర్పాటు చేసి డ్రైవర్లకు అగ్రిమెంటు ప్రకారం జీతం, ఈఎస్ఐ, పీఎఫ్‌లు సక్రమంగా ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. కమిషనర్‌తో సంప్రందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామాంజనేయులు, విజయ్, రఘు, శేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ తనిఖీ

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 29: జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు కిసాన్ ఘాట్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను శనివారం తనిఖీ చేశారు. సమయానికి డ్యూటీకి హాజరు కానీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన సిబ్బందిపై డీఎస్‌డీవో మెమోలు జారీ చేశారు.

దాడి కేసు నమోదు

కర్నూలు, జూన్ 29: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చాకలి అనూష అనే మహిళపై కొంత మంది దాడి చేసి గాయపరిచినట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు. శ్రీనగర్‌కాలనీలో నివాసముంటే చాకలి అనూష భర్త నాగరాజు మొదటి భార్య మీనాక్షి, ఆమె సోదరి రాజమ్మలు మరికొంత మందితో కలిసి దాడి చేసి గాయపరిచినట్లుగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు(న్యూసిటీ), జూన్ 29: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ భార్గవతేజ ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థకు సంబంధించి అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

సి.బెళగల్, జూన్ 29: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని మండల విద్యాధికారి ఆదాం బాషా అన్నారు. శనివారం మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల గ్రామాలలోని పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అధికంగా నదితీరా గ్రామాల్లోని విద్యార్థులు డ్రాప్ అవుటు అవుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎంఈవో వెంట ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 29: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్‌బాషాను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్.పి.సావిత్రీబాయి, ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు మంజులాదేవి శనివారం అభినందనలు తెలిపారు. నర్సెస్ అసోసియేషన్ నాయకురాలు మంజులాదేవి నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు శనివారం కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్రగౌడు, నాయకులు చంద్రశేఖర్, మాధవ రాజు, మద్దిలేటి ఉన్నారు.

కర్నూలు(స్పోర్ట్స్): నూతన కలెక్టర్ రంజిత్‌బాషాను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

కర్నూలు(న్యూసిటీ): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ బాషాను నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో కలెక్టర్‌ను కలిసి నగర పాలక సంస్థ అభివృద్ధి గురించి చర్చించారు.

● జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీవీ సుబ్బయ్య, మంజునాథ్, బజారి, షబ్బీర్ పాల్గొన్నారు. అలాగే కలెక్టర్‌ను ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే కలెక్టర్‌ను సీపీఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లాకార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, పీఎస్. రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కేవీ నారాయణ ఉన్నారు. జిల్లాలో ప్రధానంగా తాగునీటి, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకో వాలని కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగ్ సూపరింటెండెంట్లు, కమిషనర్

కలెక్టర్‌ను కలిసిన డీసీసీ

కర్నూలు(అర్బన్): నూతన కలెక్టర్ రంజిత్ బాషాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావుతోపాటు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్‌ను శాలువతో సన్మానించారు. జిల్లా పరిస్థితులపై కాసేపు చర్చించారు. కార్యక్రమంలో అనంతరత్నం మాదిగ, సయ్యద్ నవీన్, లాజరస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ శుభాకాంక్షలు

కర్నూలు(కలెక్టరేట్): నూతన కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, పానుగంటి చంద్రయ్య, జిల్లా కన్వీనర్ కే.నాగేంద్ర, కోకన్వీనర్ రమేష్, నగర అధ్యక్షుడు శివకుమార్, చంద్రమోహన్, బ్రహ్మయ్య, మధు, దామోదర్, ఎర్రమలలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ సమస్యలు, ఇంటి స్థలాల కేటాయింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

● జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప మాల విద్యార్థి సంఘాల అధ్యక్షుడు వెంకటేశ్ కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కను అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

ముస్లింలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం ఇస్తున్న ముస్లిం నాయకులు

ఓర్వకల్లు, జూన్ 29: ముస్లింలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని శనివారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నంద్యాలలో నన్నూరు గ్రామ ముస్లిం నాయకులు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. నన్నూరు గ్రామంలోని ముస్లిం మైనార్టీలకు సంబంధించి ఈద్గా, షాదీఖానా, శ్మశాన వాటిక, మసీదు ప్రహరీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయాలని మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఖాజా మియా, షంషుద్దీన్, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ నర్సుకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్), జూన్ 29: పదవీ విరమణ చేస్తున్న సీనియర్ హెడ్ నర్సు పి.స్వర్ణలతను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి సన్మానించారు. శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరీ హాలులో హెడ్ నర్సు స్వర్ణలతకు ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీ బాయి మాట్లాడుతూ 38 సంవత్సరాలు వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసిన స్వర్ణలత అంకితభావంతో పని చేశారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఏఆర్ఎంవో వెంకటరమణ, ఏడీ రమేష్‌బాబు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీటెక్, పీజీ సెమిస్టర్

కర్నూలు(అర్బన్), జూన్ 29: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 4వ సెమిస్టర్ పరీక్షలు జూలై 1 నుంచి 22 వరకు నిర్వహిస్తామని ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. 468 రెగ్యులర్, 103 మంది సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 2, 4, 5 సెమిస్టర్ పరీక్షలకు రెగ్యులర్ విభాగంలో 505, సప్లిమెంటరీలో 590 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూన్ 29: నగరంలో 33 కేవీ లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా బళ్లారి రోడ్ సెక్షన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ పి.ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్ఏపీ క్యాంప్, ఇంటర్‌నెషనల్ ఫంక్షన్‌హాల్ సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కురువలకు ప్రాధాన్యం ఇవ్వాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 29: నామినేటెడ్ పదవుల్లో కురువలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కురువ సంఘం గౌరవాధ్యక్షులు కిష్టన్న కోరారు. శనివారం నగరంలోని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను జిల్లా కురువ సంఘం నాయకులు కలిసి శాలువా కప్పి పూల బోకే అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా కోశాధికారి కేసీ నాగన్న, జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, ధనుంజయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి పాల్గొన్నారు.

ముగిసిన గురుకుల పాఠశాల పరీక్షలు

సి.బెళగల్, జూన్ 29: మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని గురుకుల పాఠశాలలో 6, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు శనివారం పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయా తరగతులలో ఆరు సీట్లు ఖాళీ ఉండగా 302 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్నా విద్యార్థులంతా పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

డీజీపీని కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే



డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), జూన్ 29: కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రామలింగారెడ్డి విజయవాడలో శనివారం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కొత్త డీజీపీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో అనంతపురం జిల్లా టీడీపీ నాయకులు అనిల్‌కుమార్ ఉన్నారు.

బైరాగి నాయుడు సేవలు మరువ లేనివి



మాట్లాడుతున్న గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్

కర్నూలు(అర్బన్), జూన్ 29: విజిలెన్స్ ఏడీగా పని చేసిన బైరాగి నాయుడు సేవలు మరువలేనివని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. శనివారం గనుల శాఖ కార్యాలయంలో పదవీ విరమణ కార్యక్రమంలో గనుల శాఖ ఉద్యోగులు, అధికారులు బైరాగి నాయుడు దంపతులను సన్మానించారు. ఈసందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ వృత్తిలో అంకితభావం, పైఅధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. బైరాగి నాయుడు మాట్లాడుతూ సొంత జిల్లాలో పదవీవిరమణ చేసిన తృప్తి కలిగిందన్నారు.

'ఉద్యోగుల సేవలు అభినందనీయం'



ఏఈ రాచయ్యను సత్కరిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(కల్చరల్), జూన్ 29: పదవీ విమరణ పొందిన నగరపాలక సంస్థ ఉద్యోగులు ఏఈ రాచయ్య, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరరావుల సేవలు అభినందనీయమని కమిషనర్ భార్గవతేజ కొనియాడారు. ఈనెల 30న పదవీ విరమణ పొందనున్న రాచయ్య, రాజేశ్వరరావులకు శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో అభినందన సభ ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అన్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంఈలు షాకీర్, శేషసాయి, ఎంహెచ్ఓ విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

కల్లూరు, జూన్ 29: విద్యుత్ శాఖలో పదవీ విరమణ పొంది ఖాళీ అయిన పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు (సీఐటీయూ) పి.నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతిని కలిసి వినతిపత్రం అందించారు.

కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నాసిర్

కల్లూరు, జూన్ 29: కర్నూలు జిల్లా కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నాసిర్‌ను నియమిస్తూ స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప జిల్లా పులివెందుల సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎస్.నాసిర్‌ను డిప్యుటేషన్‌పై కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న హాజీమియ్య తిరిగి నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లనున్నారు. సోమవారం కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నాసిర్ బాధ్యతలు తీసుకోనున్నారు.

రూ.8 లక్షల ఫీజు బకాయి వసూలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 29: నగర పాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాల అనుమతి ఫీజు బకాయిలు రూ.8 లక్షలు వసూలు చేశారు. శనివారం లోక్ అదాలత్ అధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో పట్టణ ప్రణాళికా విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక వసూలు కేంద్రంలో ఇన్‌చార్జి డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రంగస్వామి, శశిలత ఉన్నారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న 250 మందికి నోటీసులు జారీ చేశారు. అయితే 23 మంది నుంచి రూ.8 లక్షలు వసూలు చేసినట్లు డీసీపీ సంధ్య తెలిపారు. పెండింగ్ బకాయిలు కూడా లోక్ అదాలత్ ద్వారా వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు మషరత్ అలీఖాన్, శబరీష్, మంజులమ్మ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

సీబీపీ బ్లడ్ కౌంటరు వద్ద స్టాండింగ్ చైర్స్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 29: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్ వద్ద నున్న కాప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) కౌంటరు వద్ద ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి స్టాండింగ్ చైర్స్‌ను వేయించారు. ఈ నెల 25న ఆంధ్రజ్యోతి రక్తపరీక్షల కోసం బారులుతీరిన రోగులు ఉదయం నుంచి క్యూలైన్లలో ఉన్నారని, మధ్యాహ్నం ఒంటి గంటైనా రద్దీ తగ్గడం లేదని కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు సీబీపీ కౌంటరు వద్ద రోగుల రద్దీ దృష్ట్యా నడవలేని స్థితిలో ఉన్న వారి కోసం టెస్టుల కోసం వచ్చే రోగులకు ఇబ్బంది ఉందన్న కథనానికి స్పందించి స్టాండింగ్ చైర్లను వేయించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అలాగే ల్యాబ్ రిపోర్టులు త్వరగా ఇవ్వాలని ఆసుపత్రిలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సత్వరం పరిష్కారమయ్యేలా చూడాలని ఆర్ఎంవోను ఆదేశించారు.

డీఎస్ మరణం కాంగ్రెస్‌కు తీరని లోటు

కర్నూలు(అర్బన్), జూన్ 29: మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత ధర్మపురి శ్రీనివాస్ గుండెపోటుతో మరణించడం పార్టీకి తీరని లోటని డీసీసీ కే బాబు రావు శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుంటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన 1998లో పీసీసీ అధ్యక్షుడిగా, 1989. 1999, 2004లో ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్యేగా గెలిచారు. వైస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో ఆయన పీసీసీగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, అనంతరత్నం మాదిగ, ఉండవల్లి వెంకటన్న, నవీన్, లాజరస్ సంతాపం తెలిపారు..

ఇంటి వద్దకే పింఛన్: ఎంపీడీవో

కోడుమూరు, జూన్ 29: ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 1న గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు లబ్ధిదారులకు ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసే విధంగా తగు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో దివ్య తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ.1000 చొప్పున మూడు నెలలకు గాను రూ.3000, జూలైకు సంబంధించిన రూ.4వేలు కలిపి మొత్తం రూ.7వేలు అందిస్తామన్నారు.

నేడు 'భూతకాలం' నాటక ప్రదర్శన

కర్నూలు(కల్చరల్), జూన్ 29: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నెల నెలా చివరి ఆదివారం ప్రదర్శించే సాంఘిక నాటక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'భూతకాలం' సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శనివారం తెలిపారు. సినీ హాస్య రచయిత ఎం.దివాకర్‌బాబు రాసిన ఈ నాటకాన్ని హైదరాబాదుకు చెందిన గోవాడ క్రియేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహేంద్ర


మహేంద్రబాబును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎమ్మిగనూరు, జూన్29: ఎమ్మిగనూరు ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పంచముఖి ట్రేడర్స్ యజమాని మహేంద్ర బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించిన డీలర్స్ సమావేశంలో అధ్యక్షుడిగా మహేంద్ర బాబు, గౌరవాధ్యక్షులుగా మహేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా వీజీఎ దయాసాగర్, వీరారడ్డి, కార్యదర్శులుగా నాగరాజు, శేషిరెడ్డి, నరసింహ, ట్రెజరర్‌గా చంద్రశేఖర్ రెడ్డిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు మంజునాథ్ మల్లి, సత్యారెడ్డి, పురుషోత్తం గౌడ్, నాగరాజు, శివశంకర్, మధు, శేఖర్, సిరాలదొడ్డి ఖాజా, వలిలు పాల్గొన్నారు.

ఐటీఐ రెండవ విడత ప్రవేశాలకు దరఖాస్తులు

ఆలూరు, జూన్ 29: ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన రెండవ విడతలో ప్రవేశాలకు పది పాస్/ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ సి. సూర్య శేఖర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తును ప్రింట్ తీసి వచ్చే నెల 25న ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఆలూరు ఐటీఐలో వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. మెరిట్ లిస్టులో పేర్లు వచ్చిన విద్యార్థులు వచ్చే నెల 27న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మిక సమస్యలను పరిష్కరించాలి

ఆదోని టౌన్, జూన్ 29: మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదోని మునిసిపల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం మునిసిపల్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికు వినతి పత్రం ఇచారు. యూనియన్ గౌరవ సలహాదారుడు కే అజయ్ బాబు, అధ్యక్షుడు ఓబీ నాగరాజ్ మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికులకు చెప్పులు, సబ్బులు, గమ్ బూట్స్‌లతో పాటు పనిముట్లు, తొపుడుబండ్లు సానిటైజర్స్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, నాగరాజ్, సుంకన్న, కల్లుబావి రాజు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలి

చిప్పగిరి, జూన్ 29: సీజనల్ కాలం అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని ఈవోఆర్‌డీ బాలన్న అన్నారు. శనివారం చిప్పగిరి మండలం నేమకల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మనం నివాసం ఉన్న ప్రాంతాలలో పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకుంటేనే ఏ అంటూ వ్యాధులు దరిదాపుల్లోకి రావని ఈవోఆర్‌డీ బాలన్న, సచివాలయ ఏఎన్ఎం సువర్ణమ్మ గ్రామ ప్రజలకు మహిళలకు తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

గోనెగండ్ల, జూన్ 20: గ్రామాభివృద్ధి గ్రామంలోని ప్రజలు అంద రి బాధ్యతని, ఇందుకు గాను ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించాలని గ్రామ మేజర్ సర్పంచు హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ కోరారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, జేసీబీ లతో తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఉద్యోగ విరమణ

తుగ్గలి, జూన్ 29: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పెండేకల్ పంచాయితీ కార్యదర్శి అంకాలప్ప పదవి విరమణ చేశార. శనివారం ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ షర్మిళ, సర్పంచు లీలావతి అంకాలప్ప బంధువులు, సహచర ఉద్యోగులు, స్థానిక నాయకులు అంకాలప్ప దంపతులను పూలమాలలు వేసి శాలువలతో సన్మానం చేశారు.

ఉద్యోగులకు ప్రజా మన్ననలే ఆశీస్సులు

● టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూన్ 29: ఉద్యోగ పదవి విధుల్లో ప్రజా మన్ననలే ఉద్యోగికి ఆశిస్సులు అని టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోస్టాఫీసులో పోస్టుమెన్ బి.రాఘవులు పదవి విరమణ సందర్భంగా పోస్టాఫీసులో, రామచంద్రనగర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పదవి విరమణ సర్వసాధారణమన్నారు. 44 ఏళ్లుగా పోస్టుమెన్‌గా స్థానికులకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. రాఘవేంద్ర నాటక కళా సమితిలో సభ్యులుగా ఉంటూ ఆధ్యాత్మిక, పౌరాణిక నాటకాల్లో పేరు సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరదరాజులు, శ్రీనివాసులు, హనుమేష్, విజయ్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జూన్ 29 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం శనివారం భక్తులు పోటెత్తారు. జూన్ ఆఖరి శని, ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజామునుంచే స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలకు,పూజ సామాగ్రికి డిమాండ్ పెరిగింది.

రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం : పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రామఘ్రేంద స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు..

ధార్మిక పర్యటనకు బయలుదేరిన పీఠాధిపతి : మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం రాత్రి పూజలు, రథోత్సవాలు ముగించుకుని బెంగుళూరుకు తమ శిష్య బృందంతో ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లారు. దాదాపు 20 రోజులు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు అందుబాటులో ఉండర మేనేజర్ శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ అశోక్ కినగి శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి మంత్రాలయంలో బస చేశారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని మూల బృందావనానికి పూజలు చేశారు.

పింఛన్‌ల డబ్బులో రూ.50వేలు గల్లంతు

ఆదోని టౌన్, జూన్ 29: పట్టణంలోని 27వ వార్డు సచివాలయంలో పింఛన్‌దారులకు పంపిణీ చేయాల్సిన డబ్బులో రూ.50వేలు గల్లంతు అయింది. 1వ తేదీ పింఛన్‌దారులకు పంపిణీ చేయాల్సిన డబ్బు రూ.17 లక్షలను శనివారం సచివాలయ ఉద్యోగి రవి బ్యాంక్ నుంచి డ్రా చేసుకొని సచివాలయ కార్యాలయానికి చేరుకున్నాడు. డబ్బును సరిచూసుకుంటుండగా కార్యాలయంలోకి వచ్చిన ఒక అపరిచిత వ్యక్తి సిబ్బందిని ఏమార్చి రూ.50వేలు ఎత్తుకెళ్లాడు. విషయాన్ని మునిసిపల్ కమిషనర్‌కు తెలియజేసి మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సచివాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. డబ్బు దొంగలించిన వ్యక్తి ఆచూకి కోసం పోలీసులను పంపినట్లు సీఐ నరసింహరాజు తెలిపారు.

చిన్నగుడ్డు పెద్ద మోసం

● నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్

● పట్టించుకోని అధికారులు



హొళగుంద, జూన్ 29: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించడం కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ కాంట్రాక్టర్ల ద్వారా కోడి గుడ్లను పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన కోడి గుడ్లను సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్లు కాసుల కోసం కక్కుర్తిపడి అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, సర్కారు లక్ష్యానికి గండికొడుతున్నారు. హొళగుందలోని ఎస్సీ కాలనీలోని పాఠశాలకు ఐదు రోజుల క్రితం 1,400 కోడిగుడ్లును సదరు కాంట్రాక్టర్ సరఫరా చేశాడు. అయితే, అవి చిన్న పరిమాణంలో ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు గుడ్డు బరువు 45 నుంచి 52 గ్రాములుండాలి. 10 గుడ్లను ఒక యూనిట్‌గా పరిగణిస్తే.. వాటి బరువు 450 నుంచి 525 గ్రాములుండాలి. ఒక ట్రేలో 30 గుడ్లు ఉంటాయి కాబట్టి.. ట్రే బరువును తీసివేసి 1,350 గ్రాముల నుంచి 1,560 గ్రాములు ఉండాలి. కానీ కాంట్రాక్టర్లు చాలా వరకు నాసిరకం.. బరువు.. పరిమాణం తక్కువ ఉన్న గుడ్లను సరఫరా చేస్తున్నారు. కేవలం 30 నుంచి 35 గ్రాముల బరువు గల గుడ్లను పంపిణీ చేస్తున్నారు. నాణ్యత పర్యవేక్షించాల్సిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఉండడంతో పాటు, అధికారులకు ఫిర్యాదులు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఎంఈవో-1 జగన్నాథంను వివరణ కోరగా సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతామని, అలాగే పాఠశాల తనిఖీ చేసి విచారణ చెపడతామని చెప్పారు.


పాఠశాలలకు సరఫరా చేసిన కోడిగుడ్లు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి, అధికారులను నిలదీస్తున్న టీడీపీ మహిళా కౌన్సిలర్ పార్వతి

● కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్, జూన్ 29: అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి, రాజకీయాలు పక్కన పెట్టేద్దాం, అన్ని పార్టీలకు చెందిన అందరూ కలిసి పట్టణ అభివృద్ధి కోసం కృషి చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శనివారం మునిసిపల్ చైర్ పర్సన్ బోయ శాంత అధ్యక్షతన జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మొదటిసారి పాల్గొని మాట్లాడారు. మునిసిపాలిటీకు ఆదాయం తక్కువ, అవసరాలు ఎక్కువగా ఉండటం గమనించానని, పట్టణంలో రహదారులు, తాగునీటి సమస్య జటిలంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. పట్టణంలో మట్కా, పేకాట, కబ్జాలు లేకుండా చేయాలనే ధ్యేయంగా పని చేస్తానన్నారు. టీడీపీ కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ ఇంతవరకు తన వార్డులో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయలేదని, వీరభద్రేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉందని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ వైజీ బాలాజీ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం రూ. లక్షల ఖర్చుతో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వాకి టాకీలు కనిపించకుండా పోవడంపై ఎన్నిసార్లు ప్రశ్నిస్తున్న అధికారులు సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘు మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల విస్తరణతో పాటు మరికొన్ని అభివృద్ధి పనుల కోసం డీపీఆర్ (డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించడానికి ప్రైవేటు కన్సల్టెన్సీలను ఆశ్రయించడంతో మునిసిపాలిటీ పై రూ. కోట్లలో భారం పడుతోందని, కార్యాలయానికి సంబంధించిన ఇంజనీర్లతోనే ప్రణాళికలు రూపొందించేలా చూడాలన్నారు. గత రెండేళ్లుగా మోటార్లకు మరమ్మత్తుల పేరుతో రూ. కోట్ల రూపాయలు మంజూరు చేయడంపై అధికారులు పూర్తిగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసారు. వైస్ చైర్మన్ నరసింహులుతో పాటు మరికొంతమంది కౌన్సిలర్లు అధికారులపై విరుచుకుపడ్డారు. వైసీపీకు చెందిన చైర్మపర్సన్‌తో పాటు కౌన్సిల్లో ఉన్న 42 మంది కౌన్సిలర్లలో 41 మంది కౌన్సిలర్లు వైసీపీ పార్టీకే చెందినవారు ఉండగా మొదటిసారిగా కౌన్సిల్ సమావేవంలో కౌన్సిలర్లు అధికారులపై మూకుమ్మడిగా ఆరోపణలు చేయడం పలుపురిని ఆశ్చర్యానికి గురి చేసింది. సమావేశంలో కమిషనర్ రామచంద్రారెడ్డి ఎంఈ వెంకట చలపతి, రెవెన్యూ ఆఫీసర్ అస్లాం అసిస్టెంట్ సీటీ ప్లానర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇదీ ఎస్సీ బాలికల హాస్టల్!

● హాస్టల్ వెనకే మిగిలిన ఆహారం డంప్

● కాలనీ వాసుల ఫిర్యాదుతో పరిశీలించిన పంచాయతీ సిబ్బంది



ఆలూరు, జూన్ 29: ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆలూరు ఎస్సీ బాలికల హాస్టల్ వెనక భాగం. ప్రతి రోజూ విద్యార్థులు తిన్న మిగిలిన అన్నంను సిబ్బంది ఇలా హాస్టల్ వెనకభాగంలో డంప్ చేస్తున్నారు. అన్నం మురిగిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో పరిసర కోయనగర్ కాలనీ వాసులు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. పంచాయతీ సిబ్బంది హాస్టల్ వెనుక అన్నం నిల్వ ఉంచిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడే కుక్క చనిపోవడంతో మరింతగా దుర్వాసన రావడంతో దానిని తొలగించారు. హాస్టల్ పక్కనే ఇంతలా దుర్వాసన వస్తున్నా హాస్టల్ వార్డెన్‌కు తెలియకపోవడం గమనార్హం. ఇలా అన్నం వేయడం వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెంది విద్యార్థులకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పంచాయతీ మేస్త్రి లక్ష్మన్న ఫోన్‌లో వార్డెన్‌కు సూచించారు. అన్నం సరిగా లేకపోవడంతో విద్యార్థులు తినలేక ఇలా వేస్టు చేస్తున్నారని స్థానికులు వాపోయారు. వార్డెన్ పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

పంటల సాగుకు అదును దాటలేదు

● అంతర్ పంటగా కంది సాగుతో అధికలాభం

● వ్యవసాయ శాఖ ఏడీఏ


గోనెగండ్లలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గోనెగండ్ల, జూన్ 29: వివిధ పంటలను సాగు చేసుకునేందుకు సమయం దాటిపోలేదని ఇంకా సమయం ఉందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయశాఖ ఏడీఏ ఖాద్రీ, ఏవో హేమలత రైతులకు సూచించారు. శనివారం మండలంలోని పలు పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ వరి పంటను సాగు చేసుకునేరైతులు 125 రోజుల కన్న తక్కువ సమయంలో పంట చేతికి అందే రకం వరి ని సాగు చేసుకోవాలని, నేరుగా విత్తు పద్దతి పై శ్రద్ధ వహించాలన్నారు. అలాగే జూలై నెల 20 వ తేది వరకు పత్తి పంటను సాగు చేసుకోవచ్చని తెలిపారు. తెలిక నెలల్లో 50-60 మి.మీ., బరువు నెలల్లో 60-75 మి, మీ, వర్షపాతం నమోదు అయిన తరువాతనే పత్తి సాగు చేసుకోవాలన్నారు. పత్తిలో అంతర్ పంటగా కందిని సాగు చేసుకోవాలని అధిక దిగుబడిని ఇస్తుందని తెలిపారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆగస్టు నెల 15వరకు కందిని సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొక్క జొన్న పంటను జూలై 15వరకు సాగు చేసుకొవచ్చన్నారు. పెసర, మినుములను జూలై 15వరకు, ఆరుతడి పంటలైన ఆముదాలు, పోద్దుతిరుగుడు ఉలువలు, జూలై 31 వరకు సాగు చేసుకోవచ్చని సూచించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలోని రైతులు ఈ విషయాలను గమనించాలని కోరారు.

సంక్షిప్తం

విద్యార్థినులకు నోటు పుస్తకాల పంపిణీ

ఎమ్మిగనూరు, జూన్29: పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుట్టా ఫౌండేషన్ నిర్వాహకులు బుట్టా ప్రతుల్ 40మంది విద్యార్థినులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బుట్టాఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థినులకు చేయుతనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత, కేజీబీవీ ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు న్యూకేటగిరి బండలాగుడు పోటీలు

తుగ్గలి, జూన్ 29: కాశిరెడ్డినాయన ఆరాదన మహోత్సవం సందర్భంగా న్యూకేటగిరి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాంపల్లి కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద వారు మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన సన్నిధానంలో న్యూకేటగిరి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 94400 97301, 63057 18596 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

ఆలూరు, జూన్ 29: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూలై 1న వృద్ధులు, వితంతువులకు ఇంటింటికీ వెళ్లి గతంలో ఇస్తున్న రూ.3వేల పెన్షన్‌ను రూ. వెయ్యికు పెంచి రూ.4వేలు చేశాడని, దీంతో పాటు మూడు నెలలకు రూ.3వేలు కలిపి రూ.7వేలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని పండుగల నిర్వహించాలని కోరారు.

కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు ప్రారంభం

తుగ్గలి, జూన్ 29: సద్గురు కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు అంగరంగ వైభంగా ప్రారంబమయ్యాయి. శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు గణపతి పూజ, లక్ష్మినరసింహ, దత్తాత్రేయ, అన్నపూర్ణ పూజాదిక్రతువులను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పని సరి

కౌతాళం, జూన్ 29: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పని సరి అని కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున అన్నారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో సన్మాన కార్యక్రమం కళాశాల ఆధ్యాపకులు, విద్యార్థులు నిర్వహించారు. అనంతరం తోటి ఉద్యోగులు మల్లికార్జున దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి విడ్కోలు పలికారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంజన్న, విజయరాణి బంధువులు, కళాశాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి

మద్దికెర, జూన్ 29: మండలంలోని రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకొని భూమిలోని పోషక పరిస్థితులు తెలుసుకొని తద్వారా పంటలు సాగు చేసుకుంటే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి తెలిపారు. శనివారం స్థానిక వ్యవసా శాఖ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 2024-25సంబంధించి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మద్దికెర, జూన్ 29: స్థానిక జెండా కట్టా వీధిలో నివసించే టైలర్ వలి అనే వ్యక్తి అనారోగ్యంతో నాలుగు రోజుల కింద మృతి చెందడంతో కేఈ సైన్యం సభ్యులు బాధిత కుటుంబానికి అవసరమయ్యే నిత్యావసర వస్తువులను శనివారం అందజేశారు. కేఈ సైన్యం సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచనల మేరకు మండలంలో కేఈ సైన్యం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

టీడీపీది ప్రజా విజయం

గోనెగండ్ల, జూన్ 29: నియోజకవర్గంలో టీడీపీ, బీవీ జయనాగేశ్వరరెడ్డి సాధించిన విజయం ప్రజా విజయమని మండల టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు అన్నారు. శనివారం టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. చంద్రబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. న ల్లారెడ్డి స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేసి 101 టెంకాయలు సమర్పించారు. టీడీపీ నాయకులు బేతాళబడేసా, రామాంజినేయులు, రమేష్‌నాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అవ్వ తాతలకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటి వద్దకే వెళ్ళి అందజేయాలని కమిషనర్ గంగిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మునిసిపల్ కార్యలయంలో ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా కింద ఇచ్చే పింఛన్లను సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలన్నారు. పట్టణంలో 394 క్లస్టర్స్ ఉండగా అందులో 9816 మంది పింఛన్‌దారులకు ఒక్కొక్కరికి రూ 7వేలు పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఉన్న ఒక్కొక్క ఉద్యోగికి 50 మంది లబ్ధిదారులను కెటాయించినట్లు తెలిపారు. ఈ పింఛన్ కార్యాక్రమం జూలై ఒక టో తేదీ సాయంత్రంలోపు పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా లబ్ధిదారులు అందుబాటులో లేకపోతే మరుసటి రోజు వారికి పింఛన్ అందజేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు రూరల్, జూన్29: ఎమ్మిగనూరు పట్టణ సమీపంలో ఉన్న శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యతోపాటు ఉద్యోగాలు పొందేందుకు వీలుగా ఉన్న కోర్సులు ఉన్నాయని తెలిపారు. 2024-25కు గాను కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. కళాశాలలో బి.ఏ(హిస్టరి, ఎకనామిక్స్), బీ.కాం(డిజిటల్ మార్కెటింగ్, కంప్యూటర్), బీఎస్సీ (మాథ్స్, బోటని, కెమిస్ట్రీ, సైన్స్) కోర్సులు ఉన్నాయన్నారు. డిజిటల్ క్లాసులు జరుగుతాయని, అన్ని పరకరాలు ఉన్న ల్యాబ్, ఇంటర్‌నెట్ సౌకర్యం వంటి అన్ని సౌకర్యాలను కల్పించామని పేర్కొన్నారు.

బాలుడిపై పిచ్చికుక్క వీరంగం

● తీవ్ర గాయాల పాలైన బాలుడు

● మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోనికి తరలింపు


పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాలుడు ఫర్హాన్

హొళగుంద, జూన్ 29: హొళగుందలోని ఈబీసీ కాలనీలో ఇంటిముందు ఆడుకుంటున్న ఫర్హాన్ అనే మూడేళ్ల బాలుడిపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాలుడు తండ్రి సైఫుల్లా శనివారం తెలిపారు. బాలుడి తల, మెడపై ఇష్టానుసారంగా కరవడంతో తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం హొళగుంద పీహెచ్‌సీకీ తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఫర్హాన్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి

ఆస్పరి, జూన్ 29: ప్రభుత్వ పాఠశాలల్లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు మునిస్వామి కోరారు. శనివారం ఆస్పరిలో ప్రభుత్వ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని ఆయన చెప్పారు. ఏడవ తరగతి సంబంధించిన రెండు పాఠ్య పుస్తకాలు మాత్రమే పంపిణీ చేశారని మిగిలిన మూడు సబ్జెక్టులు సంబంధించిన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని వివరించారు.

వివాహిత అదృశ్యం

ఆదోని రూరల్, జూన్ 29: పెద్దకడుబూరు మండలానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం తెలిపారు. పెద్దకడబూరుకు చెందిన అరుణను ఆస్పరి మండలం గార్లపెంటకు చెందిన మధుతో ఏడాది క్రితం వివాహం చేశారు. శుక్రవారం ప్రార్థనలో భాగంగా, భర్తతో కలిసి అరుణ ఆదోని మండలం బసరకోడుకు వచ్చింది. ప్రార్థనలో ఉన్న అరుణ కనిపించకపోవడంతో భర్త తాలుక పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

సత్వర కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయం

● జూనియర్ సివిల్ జడ్జి భారతి

పత్తికొండ టౌన్, జూన్ 29: సత్వర కేసుల పరిష్కారమే లోక్ అదాలత్‌ల ధ్యేయమని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. శనివారం స్థానిక సివిల్ జడ్జి కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో ఇరువర్గాల కక్షిదారులను విచారించి 81 కేసులను పరిష్కరించినట్లు క్లర్క్ రమణమ్మ తెలిపారు. ఇందులో 42 క్రిమినల్ కేసులు, 17 సివిల్ కేసులు, 3 భరణం కేసులు, 9 చెక్‌బౌన్స్ కేసులు, 10 ఈపీ కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రంగస్వామి, మహేష్, న్యాయవాదులు సురేష్ కుమార్, ఎల్లారెడ్డి, మైరాముడు, సత్యనారాయణ, సురేంద్ర, కృష్ణయ్య, దామోదరాచారి పాల్గొన్నారు.

వైఎస్సార్ నేమ్ బోర్డు తొలగింపు


వైఎస్సార్ బోర్డును తొలగించిన దృశ్యం

ఆదోని రూరల్, జూన్ 29 : ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఆరేకల్లు సమీపంలో ఇంకా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీకి డాక్టర్ వైఎస్సార్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అని బోర్డు వేశారు. దీంతో ఈ నెల 27న ఆంధ్రజ్యోతిలో 'నిర్మాణంలో ఉన్న కాలేజీకి వైఎస్సార్ పేరు' అన్న కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. దీంతో ఆఘమేఘాల మీద అధికారులు, కాంట్రాక్టర్లు ఆ బోర్డును తొలగించడంతోపాటు అక్కడ వాల్ బోర్డులకు ఉన్న జగన్ బొమ్మలను కూడ తొలగించారు. అధికారులుగాని, కాంట్రాక్టర్లుగాని అత్యూత్సాహం ప్రదర్శించకూడదని, జగన్, వైఎస్సార్ పార్టీ జపాన్ని మానుకొని ముందుకెళ్లాలని కూటమి నాయకులు హితవు పలికారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సెబ్‌లో పోలీసుల కష్టాలు

● స్టాఫ్ కొరతతో అదనపు పని భారం అంటున్న సిబ్బంది

పత్తికొండ టౌన్, జూన్ 28: ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ అంటే తెలియనివారుండరు. అక్రమ మద్యం, సారా వంటి ఇతర నేర నియంత్రణ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను నియమించింది. ఎన్నో ఏళ్లుగా ఎక్సైజ్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఆ శాఖను గత వైసీపీ ప్రభుత్వం రెండుగా చీల్చేసింది. ఒకటి ఎక్సైజ్‌శాఖ, మరొకటి సెబ్ శాఖలుగా విడగొట్టారు. దీంతో రెండు శాఖలకు సిబ్బందిని కేటాయింపులు జరగడంతో పత్తికొండ సెబ్ పోలీస్‌స్టేషన్‌కు సిబ్బంది కొరత ఏర్పడి అదనపు పనిభారం అవుతోందని ఆ శాఖ సిబ్బంది మొర పెట్టుకుంటున్నారు. పత్తికొండ ప్రత్యేక నేర నియంత్రణ విభాగం శాఖ పరిధిలో ఒక ఎక్సైజ్ సీఐతో పాటు ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది పోలీసులతో పాటు రైటర్ ఉండాల్సి ఉంది. అయితే.. అందులో ఒక సీఐ, ఒక ఎస్ఐతో పాటు కొంత మంది కానిస్టేబుల్‌తోనే పని చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పోలీసులే వాపోతున్నారు. 'గతంలో నెలకొకసారి నైట్ డ్యూటీలు ఉండేవి. ప్రస్తుతం వారానికి ఒకసారి నైట్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది' అంటూ మహిళా కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టాఫ్ కొరతతో ఉన్న కొద్దిమంది సిబ్బందికే అదనపు భారం పడుతుండటంతో మానసిక ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నామని ఓ కానిస్టేబుల్ తమ వేదనను వినిపించారు. ఇప్పటికైనా పాత విధానాన్ని ఎక్సైజ్‌శాఖను పునరుద్ధరించి గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన సెబ్ శాఖను తొలగించి పాత పద్ధతిలోనే ఎక్సైజ్ శాఖను కొనసాగించాలని ఆ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు . ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసి అదనపు బాధ్యతలు, పనిభారాన్ని తగ్గించేందుకు చొరవ చూపాలని ఆ శాఖ ఉద్యోగులు తెలుపుతున్నారు.

● సిబ్బంది కొరత వాస్తవమే

సెబ్ శాఖలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. అయితే.. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అధికారుల ఆదేశాలను తప్పకుండా పాటిస్తూనే ఉన్నాం. ఉన్న సిబ్బందితోనే సక్రమంగా డ్యూటీలను కొనసాగిస్తున్నాం. సిబ్బందిని ఖాళీగా ఉన్న స్థానాల్లో నియమిస్తే బాగుంటుంది.

- సెబ్ సీఐ సువర్ణలత